క్లుప్తంగా

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

వ్యవసాయాధికారి రాగమ్మ



ఈకేవైసీ కేంద్రాన్ని ప్రారంభించిన వ్యవసాయాధికారి రాగమ్మ

మొయినాబాద్‌: పీఎం కిసాన్‌కోసం ఈకేవైసీ వెంటనే చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ అన్నారు. మొయినాబాద్‌ రైతు వేదికలో శుక్రవారం ఈకేవైసీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్‌ పథకం ద్వారా డబ్బులు జమ కావాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్నవారు ఈ నెల ఆఖరులోగా చేయించుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా మొయినాబాద్‌ రైతువేదికలో ఈకేవైసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సునీల్‌, ఈకేవైసీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత



నగదు అందజేస్తున్న గోపాల్‌గౌడ్‌

షాద్‌నగర్‌: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మాజీ సీఆర్‌పీఎఫ్‌ జవాన్‌ గోపాల్‌గౌడ్‌ శుక్రవారం రూ.51వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేష్‌గుప్తా, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌ రెడ్డి

కొందుర్గు: యువత క్రీడల్లో రాణించాలని పాలమూరు చారిటబుల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు విష్ణవర్ధన్‌ రెడ్డి అన్నారు. జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలో క్రికెట్‌ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చాలమంది అనారోగ్యానికి గురవుతున్నారని, సరైన వ్యాయామం లేకపోవడం వల్లే రోగాలు దరిచేరుతున్నాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి, వివిధ పార్టీల నాయకులు సలీమ్‌, నర్సింహా, హరీశ్‌, అశోక్‌, రాజు, మల్లేష్‌, రవీందర్‌ రెడ్డి, శివకుమార్‌, యాదగిరి గౌడ్‌ పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌ రెడ్డి



పూజలు చేస్తున్న శ్యాంసుందర్‌ రెడ్డి

నందిగామ: ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చేగూరులో శివాలయ వార్షికోత్సవ పూజలు గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అత్యద్భుతంగా దేవాలయాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు. దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ అశోక్‌, మాజీ చైర్మన్‌ విఠల్‌, మాజీ సర్పంచ్‌ జెట్టి కుమార్‌, పంతుళ్లు వీరేశం, కరుణాకర్‌, మల్లికార్జున్‌ గ్రామస్తులు పబ్బే నరేందర్‌, మంచనపల్లి రాజు, మంకాల శ్రీశైలం, కావలి మధు, అన్నారం రాజు, అంజయ్య, పాల్గొన్నారు.

కాలిబాటతో తెగుళ్ల నివారణ

దిగుబడి పెరిగే అవకాశం

- సరైన పద్ధతి పాటిస్తే రైతులకు మేలు
- వ్యవసాయ శాఖ మండల అధికారి వెంకటేశం



వెంకటేశం, మండల వ్యవసాయాధికారి, షాబాద్‌



కాలిబాట తీసిన వరిసాగు

షాబాద్‌: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వరి పంటను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నా అను కున్న దిగుబడులు రావడం లేదు. నాట్లు వేసే సమయంలో వరినాళ్లను దగ్గర దగ్గరగా నాటడంతో అనేక తెగుళ్లు వ్యాపించి దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ క్రమంలో రైతులు నాట్లు వేసే సమయంలోనే తగిన జాగ్రత్త తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరినాళ్లు వేసేటప్పుడు కాలిబాట వదిలితే తెగుళ్లు వ్యాపించకుండా అవి ఏపుగా పెరుగుతాయని దీంతో మంచి లాభాలు వస్తాయని షాబాద్‌ మండల వ్యవసాయాధికారి వెంకటేశం పేర్కొన్నారు.

సరైన పద్ధతిని ఎంచుకోవాలి

వరి నాటే సమయంలో ఎన్ని ఎక్కువ నాటితే అంత దిగుబడి సాధించొచ్చని రైతులు భావిస్తుంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. వరి సాగులో మొక్కల సాంద్రత చాలా కీలకం. దగ్గరగా నాటడం వల్ల పంటలో అంతర వాతావరణం ప్రతికూలంగా మారుతుంది. దీంతో గాలిలో తేమ చీడపీడలకు అనుకూలంగా మారుతుంది. మొక్కలు విస్తరించి ఆకులు పొడవు పెరిగే కొద్దీ చీడపీడల ఉధృతి అధికమవుతోంది.

కాలిబాటతో ఉపయోగాలు

వరిసాగులో తెగుళ్ల బెడదను తగ్గించుకునేందుకు పొలంలో కాలిబాటలు తీయడం లేదా పాయలు, దారులు ఏర్పాటుచేయాలి. కాలిబాటల వల్ల 40 రోజుల వరకు మొక్కలు పెరగవు. కాబట్టి పెద్దగా ఉపయోగం ఉండదు. ఈ సమయంలో కాలిబాటల్లో పచ్చి రొట్ట ఎరువులను పెంచి 35 రోజుల వయసులో అంటే పూత దశలో అదే కాలిబాటలో తొక్కవచ్చు. దీంతో మొక్కలకు ఎరువును సైతం అందించవచ్చు. కాలిబాటల్లో సెస్బేనియా రోస్ట్రేటా అనే లెగ్యుమినేసి జాతికి చెందిన మొక్కలు పెంచవచ్చు. ఈ మొక్కలకు కాండం, వేర్లు రెండింటి మీద నత్రజని స్థాపక బొడిపెలు ఉంటాయి. ప్రతి మొక్కలో 100 గ్రాములకు గాను 4.1గ్రాము నత్రజని, 0.4గ్రాము, భాస్వరం 4.90 గ్రాము పొటాషియం ఉంటాయి. ఇందుకోసం వరినారు పోసుకున్న 15 రోజుల తర్వాత పొలానికి ఓ వైపు పిచ్చి రొట్ట విత్తనాలను చల్లుకోవాలి. వరి నాటేటప్పుడు ప్రతీ 2 మీటర్లకు సెం.మీ చొప్పున కాలిబాట వదిలి ఆబాటల్లో సెస్బేనియా రోస్ట్రేటా మొక్కలు నాటుకోవాలి. 40 రోజుల తర్వాత ఈ మొక్కలను కాలితో తొక్కితే ఎరువుగా సైతం ఉపయోగపడుతుంది. ముఖ్యంగా బూడిద రంగు దోమ, తెల్లదీపపు దోమలను అదుపు చేయొచ్చు. దోమలు, పచ్చ దీపపు పురుగులను వరి చేను దిగువ భాగంలో దుబ్బులను ఆశించి నష్టపరుస్తాయి. చేను కదిలించినప్పుడు ఎగురుతూ కనిపిస్తాయి. వీటిని నియంత్రించేందుకు కాలిబటలు ఎంతో ఉపయోగపడతాయి.

కాలిబాటల్లో పచిరొట్ట ఎరువు

కాలిబాటల్లో పచ్చిరొట్ట ఎరువులను 35 రోజులకు తొక్కేయడం వల్ల హెక్టారుకు 7.38 కిలోల నత్రజని లభిస్తుంది. సెస్బేనియా రోస్ట్రేటా మాములు పచ్చిరొట్ట కన్నా 10 రెట్లు ఎక్కువగా జత్రనని స్థాపన బొడిపెలుంటాయి. ఈ మొక్క వరికి నత్రజనిని అవసరమైన రూపంలో అందిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఒక వరుస వరి, మరో వరుస పచ్చి రొట్ట ఎరువును పెంచి దానిని పూత సమయంలో ఎరువు వల్ల భూమిలో రైజోబియం, మొత్తం బాక్టీరియాల సంఖ్య పెరుగుతుంది.

సమగ్ర సస్యరక్షణకు అనుకూలం...

కాలిబాటలు సమగ్ర సస్యరక్షణలో ఒక భాగంగా నిలుస్తాయి. అలాగే ఎరువులను కాలిబాటల వెంట నడుచుకుంటూ వేస్తే పొలం అంతా సమానంగా పడుతుంది. దీనికి తోడు పంటలకు వేసిన సేంద్రియ ఎరువు త్వరగా చివకాలంటే తగిన గాలి, వెలుతురు, సూక్ష్మజీవులు అవసరం. కిరణజ్యసంయోగ క్రియ బాగా జరిగి మొక్కలో పత్రహరితం అధికంగా ఉత్పత్తి అయి అధిక దిగుబడులు వస్తాయి.

కేళీలను సులభంగా తొలగించవచ్చు

వరి పంటలో వేరే రకాల దుబ్బులను ఏరివేసి పంట నాణ్యతను పెంచుకోవచ్చు. తేలికైన కలుపును నిర్మూలించవచ్చు. సమర్థవంతంగా ఎలుకల్ని నివారించవచ్చు. కాలిబాటల వల్ల ఎలుకల బొరియలు గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టడం సులభం. వరికోత సమయంలో కింద పడిన చేనును నిలబెట్టడంజలు చుట్టడం లాంటివి కాలిబాటలతో అయితే సులభంగా చేయొచ్చు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

పార్టీ సీనియర్‌ నాయకుడు నర్సింహగౌడ్‌



మాట్లాడుతున్న నర్సింహగౌడ్‌

కొత్తూరు: రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని కో కన్వీనర్‌ నర్సింహ్మగౌడ్‌ తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న విజయసంకల్ప్‌ యాత్రపై ఆయన కొత్తూరు పట్టణంలో శుక్రవారం పలువురు నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సింహ్మగౌడ్‌ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిస్తాయన్నారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకోవడం, అవినీతిరహిత పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జగన్‌, మల్లేష్‌, రాఘవేందర్‌రెడ్డి, రణధీర్‌గౌడ్‌, రాఘవులుగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్‌ సీటును బీసీలకు కేటాయించాలి'

షాద్‌నగర్‌ రూరల్‌: మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ సీటును బీసీలకు కేటాయించాలని రజక రిజర్వేషన్‌ సమితి జాతీయ కన్వీనర్‌ నడిమింటి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని దేవి గ్రాండ్‌ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రంవచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దేశాన్ని పాలించిన పార్టీలు బీసీలను మోసం చేశాయని ఆరోపించారు. దేశంలో అధిక జనాభా ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలపట్ల బీజేపీ, కాంగ్రెస్‌ బీఆర్‌ఎస్‌లు కపట ప్రేమను ఒలకబోస్తున్నాయని ఆరోపించారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు రాజకీయ చైతన్యాన్ని సాధించినప్పుడే అభివృద్ధి చెందుతారని ఆయన అన్నారు. బీసీలందరు ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చినప్పుడే హక్కులను సాధించుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్‌ మహాసభ మహబూబ్‌నగర్‌ అధ్యక్షుడు కంచనపల్లి చెన్నయ్య, సామాజిక ఉద్యమకారుడు తుప్పుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు

వెంకన్న ఆలయంలో రథసప్తమి వేడుకలు

చేవెళ్ల: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు స్వామివారికి సప్తవాహన సేవలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని సప్తవాహన సేవలైనా సూర్యప్రభవాహనం, హంసవాహనసేవ, సింహవాహనసేవ, శేషవాహనసేవ, గజవాహన సేవ, హనుమంతవాహన, గరుడవాహన సేవలపై స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు శ్రీకాంత్‌, శ్రీపాదులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం

ఎస్‌ఐ లింగం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లింగం

కేశంపేట: సైబర్‌ నేరాలను నియంత్రించాలంటే తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లింగం అన్నారు. మండల పరిధిలో కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లింగం మాట్లాడుతూ విద్యార్థులు ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్‌ వాడితే అందులోని తమతమ వివరాలను సేకరించి సైబర్‌ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతారన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది రమేశ్‌, శివ, శ్రీను, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూలులో వేగం పెంచండి

ఎంపీడీఓ వెంకయ్య గౌడ్‌



మాట్లాడుతున్న వెంకయ్య గౌడ్‌

శంకర్‌పల్లి: గ్రామాల్లో పన్నుల వసూలులో వేగం పెంచాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్‌ పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిషత్‌ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వంద శాతం వసూలు చేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విశ్వకర్మ పథకాన్ని అమలు చేయాలని సూచించారు. కాగా నర్సరీల్లో మొక్కలు పెంచడంతో పాటు పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీల సంఖ్యను కూడా పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మాణయ్య

మొయినాబాద్‌: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల అధ్యక్షుడు మాణయ్య అన్నారు. శుక్రవారం మొయినాబాద్‌ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ కింద నిధులు మంజూరు చేసిందన్నారు. అజీజ్‌నగర్‌, నాగిరెడ్డిగూడ, బాకారం, అమ్డాపూర్‌, ముర్తూజగూడ, మొయినాబాద్‌, సురంగల్‌, శ్రీరాంనగర్‌, వెంకటాపూర్‌, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, కనకమామిడి, పెద్దమంగళారం, ఎనికేపల్లి, హిమాయత్‌నగర్‌, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్‌, మోత్కుపల్లి, చిన్నమంగళారం, ఎలుకగూడ, మేడిపల్లిలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామా ల్లో వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొద లు పెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కులగణనతో పేదలకు న్యాయం

అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, త్రాగు నీరు అందించేందుకు చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు 80శాతం పూర్తయ్యాయని గత ప్రభుత్వం ప్రగల్బాలు పలికిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఐదు లిఫ్టులు, ఆరు రిజర్వాయర్లతో పాటుగా షాద్‌నగర్‌ పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్‌ నిర్మిస్తామని కేసీఆర్‌ హామీ ఇచ్చిన విషయాన్ని సభదృష్టికి తెచ్చారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి కాలేదని, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. ఈ రిజర్వాయర్‌ పూర్తయితే షాద్‌నగర్‌ సస్యశ్యామలం అవుతుందన్నారు. త్రాగునీరు, సాగు నీటి సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అదేవిధంగా ఇంటింటికి నల్లా ద్వార మంచినీటిని అందించే చేపట్టిన మిషన్‌ భగీరథ పథకం అస్తవ్యస్థంగా మారిందన్నారు. చాలా గ్రామాలకు మంచి నీరు సరఫరా కావడం లేదని, పైప్‌ లైన్‌ మరమ్మతు పనులు చేపట్టడం లేదన్నారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా నిరుపేదలకు పంపిణీ చేసేందుకు నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను ఎన్నికల ముందు ఓట్ల కోసం బీఆర్‌ఎస్‌ నేతలు హడావుడిగా ప్రారంభించారని, వాటిని పేదలకు కేటాయించలేదన్నారు. అర్హులైన వారికి పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పొన్నం, వీర్లపల్లి

షాద్‌నగర్‌ రూరల్‌: అసెంబ్లీ సమావేశాలలో భాగంగా శాసనసభలో సమగ్ర కుల గణనపై శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ సీఎం రేవంత్‌రెడ్డికి పూలబొకె ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బలహీన వర్గాల బలోపేతం కోసమే కాంగ్రెస్‌ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేతో పాటు సమగ్ర కుల గణన చేపట్టేందుకు ఏకగ్రీవ తీర్మాణం చేయడం హర్షనీయమని వారు అన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలకు అర్హులైన వారికి అందించేందుకు సమగ్ర కులగణన ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వారు పేర్కొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

మండల విద్యాధికారి అక్బర్‌

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణంలో దాతల సహకారం అభినందనీయమని శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్‌, మోకిల సర్పంచ్‌ పట్లోళ్ల సుమిత్రామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోకిల ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని వరప్రసాద్‌ కన్‌స్ట్రక్షన్‌ అధినేత రావెళ్ల వరప్రసాద్‌ తన తండ్రి రావెళ్ల వినాయక రావు జ్ఞాపకార్థం రూ. 1.20లక్షలతో నిర్మించిన భవనంతో పాటు ఆర్‌ఓ వాటర్‌ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాత వరప్రసాద్‌ సహకరించడం సంతోషకర విషయమన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం వరప్రసాద్‌ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం తనవంతు సహాయసహకారాలు ఎళ్లప్పుడు అందజేస్తామన్నారు. దాత వరప్రసాద్‌ దంపతులను మాజీ సర్పంచ్‌ సుమిత్రామోహన్‌రెడ్డి సన్మానించారు. మోకిల పీఏసీఎస్‌ చైర్మన్‌ గోపాల్‌, మాజీ సర్పంచ్‌లు అడివయ్య, నర్సింలు, మాజీ ఉప సర్పంచ్‌ రాజు, కాంగ్రెస్‌ అధ్యక్షుడు గొంధ్ర సత్యం, మాజీ వీఆర్‌ఓ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ మాట ఇస్తే తప్పదు



చేవెళ్ల: పార్టీలో చేరుతున్న యూత్‌ నాయకుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి

చేవెళ్ల: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. శుక్రవారం వికారాబాద్‌ జెడ్పీ చైర్‌పర్సన్‌ పట్నం సునీతా రెడ్డితో పాటు మండలానికి చెందిన బీఆర్‌ఎస్‌ నియోజకవర్గం యూత్‌ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌ రెడ్డి, దేవునిఎర్రవల్లికి చెందిన మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ మాసన్నగారి మానిక్యరెడ్డి, రేగడి ఘనాపూర్‌ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ యూత్‌ నాయకుడు రఘువీర్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీల సమక్షంలో పార్టీలో చేశారు.

షాబాద్‌లో..

షాబాద్‌: కాంగ్రెస్‌ మాట ఇచ్చిందంటే తప్పదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ పేర్కొన్నారు. షాబాద్‌ మండల కేంద్రంలోని కాంగ్రెస్‌ కార్యాలయంలో సర్దార్‌నగర్‌ మాజీ సర్పంచ్‌ మునగపాటి స్వరూప నర్సింహులుతో సహా 100 మంది తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. వారికి భీంభరత్‌ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా భీంభరత్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ తన సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం యూత్‌ అధ్యక్షుడు పెంటారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్‌, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్‌, మాజీ సర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, ర్యాకల శేఖర్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు రవీందర్‌, శేఖర్‌, మంగలి చెన్నయ్య, యాదగిరి, దండు రాహుల్‌గుప్తా, సత్యనారాయణ, బుచ్చయ్య, చిన్నయ్య, పాల్గొన్నారు.




కొత్తూరులో ర్యాలీ




కేశంపేట: ర్యాలీలో ఏఐటీయూసీ నాయకుడు టంగుటూరి నర్సింహరెడ్డి

కేంద్రం తీరుతో కార్మికులకు అన్యాయం

దేశవ్యాప్త గ్రామీణ భారత్‌బంద్‌ను పలు కార్మికసంఘాల నాయకులు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. కార్పొరేట్‌ సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూరే విధంగా కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాల సవరణను వెంటనే ఉపసంహరించాలని సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, పలుకార్మిక సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. అక్కడక్కడ పారిశ్రామికవాడల్లో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. రోడ్లపై ఆయా కూడళ్ల వద్ద ధర్నా, బైక్‌ ర్యాలీలు చేపట్టారు.



చేవెళ్ల: ధర్నాలో కార్మిక సంఘాల నాయకులు కె రామస్వామి, డిజి నర్సింగ్‌రావు



కొందుర్గు: రాస్తారోకోలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య